క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ఆర్చరీలో బంగారు పతకం



మహబూబ్‌నగర్ క్రీడలు: మహబూబాబాద్ జిల్లా నెదర్‌కెలిలో మంగళవారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లా ఆర్చరీ పోటీల్లో జిల్లా క్రీడాకారిణి సాయిసమీక్ష మెరుగైన ప్రతిభ కనబరిచింది. అండర్–14 విభాగంలో బంగారు పతకం సాధించి గుజరాత్ రాష్ట్రం కేడలో ఈనెల 18 నుంచి 20 వరకు జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది.

నేడు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవాబుపేట: సామాజిక సర్వే చేపట్టడం ద్వారా తెలంగాణ బీసీలకు మేలు జరుగుతుందని, అందుకే సీఎం రేవంత్‌రెడ్డితో పాటు సోనియా, రాహుల్‌గాంధీల చిత్రపటాలకు పాలాభిషేకం చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి మల్లేష్‌యాదవ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి బీసీలందరు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు టై, బెల్ట్‌ల పంపిణీ



మిడ్జిల్: మండలంలోని చిల్వేర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం గ్రామ మాజీ సర్పంచ్ సంయుక్తరాణి టై, బెల్ట్‌లు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉండాలని టై, బెల్ట్‌లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజారెడ్డి, జైపాల్‌రెడ్డి, సత్యం, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేటలో ఘనంగా బోనాలు



నవాబుపేట: మండల కేంద్రంలో కురివినిశెట్టి సంఘం ఆధ్వర్యంలో కార్తీకమాసం బోనాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం గ్రామంలో మహిళలు ఊరేగింపు నిర్వహించి గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిన్నయ్య, నరేష్, రఘుకుమార్, జనార్దన్, శ్రీనివాస్, చిన్నస్వామి, బాల్‌రాజ్, రవి పాల్గొన్నారు.

ధర్మయుద్ధ సదస్సు జయప్రదం చేయండి

మిడ్జిల్: 7న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే మాదిగల ధర్మయుద్ధ సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవనం దగ్గర నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో జంగయ్య, వీరస్వామి, బుచ్చయ్య, బంగారయ్య, వెంకటయ్య, గణేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

'కుల, మత రహిత వారి వివరాలు తీసుకోవాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టే సమగ్ర కుటుంబ సర్వేను స్వాగతిస్తున్నామని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు ప్రొ.జి.హరగోపాల్, కన్వీనర్ ఎం.రాఘవాచారి మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. అయితే కుల, మత రహిత మనుషుల వివరాలు (అదర్స్ కాలమ్‌లో) సేకరించాలన్నారు. ఈ సర్వే నాగరికంగా ఉండాలని, ఎవరు ఎంటో ఆ స్థాయిలో వనరుల కేటాయింపునకు ఇది ఉపయోగపడాలన్నారు. ముఖ్యంగా కులం, మతం లేని మానవీయ ప్రజాస్వామిక సమాజం కావాలన్నారు.

ఇసుక టిప్పరు పట్టివేత

మిడ్జిల్: మండలం మీదుగా మంగళవారం ఉదయం కల్వకుర్తి వైపు ఇసుక లోడ్‌తో వెళ్తున్న టిప్పరును మున్ననూర్ టోలిగేట్ దగ్గర పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్‌తో ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, శాట్స్ ఛైర్మన్ శివసేనారెడ్డి
- వేములలో వాలీబాల్ మైదానం ప్రారంభం



వేములలో వాలీబాల్ గ్రౌండ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్, శాట్స్ ఛైర్మన్ శివసేనారెడ్డి

అడ్డాకుల: క్రీడల్లో రాణించే యువతకు ఉజ్వల భవిషత్ లభిస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, శాట్స్ ఛైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. మూసాపేట మండలం వేములలో ఎమ్మెల్యే సహకారంతో కాంగ్రెస్ నాయకుడు రవిరాజాచారి ఏర్పాటు చేయించిన వాలీబాల్ గ్రౌండ్‌ను ఎమ్మెల్యే, శాట్స్ ఛైర్మన్ మంగళవారం సాయంత్రం ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లో సత్తాచాటాలని కోరారు. క్రీడలతో శారీరక మానసికోల్లాసం కలుగుతాయని అన్నారు. కార్యక్రమంలో అరవింద్‌రెడ్డి, బాలనర్సింహులు, యాట సత్యం, రవిరాజాచారి, రేవతి, సుధాకర్, నాగేశ్వర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, కాశీం, నర్సింహ ఉన్నారు.

మాది రైతుసంక్షేమ ప్రభుత్వం

భూత్పూర్: రైతుల కష్టాలను స్వయంగా చూసి, రైతులు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశ్యంతో ముందుస్తుగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని, తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అన్నాసాగర్, మహబూబ్‌నగర్ రూరల్ మండలం గాజులపేటలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు, ఈ సీజన్ నుంచే సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, అడ్డాకుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగిరెడ్డి, మాజీ సర్పంచులు, హర్యానాయక్, కొండన్న, నాయకులు సంజీవరెడ్డి, తిరుపతయ్య, బాలవర్ధన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, తిరుపతయ్యగౌడ్, రవి ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



వెంకటాయపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

దేవరకద్ర: మండలంలోని వెంకటాయపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏఓ రాజేందర్ అగర్వాల్ ప్రారంభించారు. రైతులు నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం తెచ్చి ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర రూ.2,320లతో పాటు బోనస్ రూ.500 పొందవచ్చన్నారు. రైతులు పండించిన ధాన్యం ఎక్కడికక్కడ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ ఛైర్మన్ హన్మంతరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ భారతమ్మ, కోన రాజశేఖర్, వీరేష్, గోపాల్, రాజుగౌడ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి చేస్తా

- మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్
- హౌసింగ్‌బోర్డు కాలనీలో సీసీరోడ్డు పనులు ప్రారంభం



హౌసింగ్‌బోర్డు కాలనీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని మున్సిపల్ ఛైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం నాలుగో వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అంతకుముందు 15వ వార్డు పరిధిలోని తిర్మల్‌కుచ్చతండా, లచ్చిరాంతండాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ విలీన గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్ రామాంజనేయులు, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్‌నాయక్, హనుమంతు, యాదగిరి, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ మార్గాన్ని అనుసరించాలి



మహమ్మదాబాద్‌లో గాంధీ ప్రతిమకు పూజలు చేస్తున్న ఆర్యవైశ్య నాయకులు

హన్వాడ/మహమ్మదాబాద్: గాంధీ చూపించిన మార్గాన్ని ప్రతి ఒక్కరు అనుసరించాలని, ముఖ్యంగా యువతను సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని రిటైర్డ్ డీఈఓ విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం సత్యశోధన పాదయాత్రలో భాగంగా మహమ్మదాబాద్ మండల కేంద్రానికి చేరుకుని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీ జయంతి రోజు అలంపూర్‌లోని జోగుళాంబ ఆలయం నుంచి ప్రారంభమైన సత్యశోధన పాదయాత్ర నేటికి 35 రోజులు అయిందన్నారు. ప్రస్తుతం యువత గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు అలవాటుపడి పెడదారిన పడుతున్నారని, విద్యార్థులు, యువత బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు అనంతయ్యగుప్తా, మాజీ ఎంపీటీసీ చెన్నయ్య, గ్రామస్తులు వేణుగౌడ్, జనార్ద న్, కేశవులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడండి

- కలెక్టర్ విజయేంద్ర బోయి



వరిధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేంద్రబోయి

దేవరకద్ర: కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చిన రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని కలెక్టర్ విజయేంద్ర బోయి అధికారులకు సూచించారు. దేవరకద్ర మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ సందర్శించారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ఐదు రోజులు గడిచినా, ఇప్పటి వరకు ధాన్యం కొనకపోవడం ఏమిటని కలెక్టర్ సంబంధిత అధికారులను ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం ధాన్యం రైతులు తేవడం లేదని, కోత కోసిన తరువాత ఆరబెట్టడం లేదని, తూర్పార పట్టడం లేదని అధికారులు తెలిపారు. ఇక తేమ శాతం ఎక్కువ ఉండడంతో పాటు ధాన్యంలో తాలు, గడ్డి ఉంటుందని, దీని వల్ల కొనుగోలు ప్రారంభం కాలేదని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. తేమగా ఉన్న ధాన్యం మార్కెట్‌కు వస్తోందని, వ్యాపారులు వచ్చిన ధాన్యం ధరలు తగ్గించి కొంటున్నారని తెలిపారు.

నాణ్యతగా ఉంటేనే మద్దతు ధర..

రైతులు కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకుంటేనే మద్దతు ధరతో పాటు బోనస్ లభిస్తుందనే విషయం గ్రహించాలని కలెక్టర్ తెలిపారు. కోతలు కోసిన అనంతరం ధాన్యం తూర్పారబట్టి ఆరబెట్టుకుని నాణ్యతగా తీసుకొస్తే కొనుగోలు కేంద్రం ద్వారా క్వింటాల్‌కు రూ.2320 చెల్లించడంతో పాటు రూ.500 బోనస్ కలిపి రూ.2850 ధర లభిస్తుందనే విషయం రైతులు గుర్తించుకోవాలన్నారు. దేవరకద్ర మండలంలోని ఐదు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తూర్పు పట్టడానికి మిషన్లను కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. ధాన్యం తూర్పు పట్టి ఆరిన తరువాత కొనాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతిరోజు పరిశీలించి రైతులకు సమస్యలు రాకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ సెక్రటరీ జయలక్ష్మి, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏఓ రాజేందర్ అగర్వాల్, సీఈఓ శ్రీనివాసులు, ఈఓ సీత్యానాయక్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ఫారూఖ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక సర్వే

నవాబుపేట: నేటి నుంచి మండలంలో సామాజిక సర్వే ప్రారంభమవుతుందని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్‌లు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఇంటింటికి స్టిక్కరింగ్ కార్యక్రమం బుధవారం ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు. సర్వేకు ఉపాధ్యాయులు, తదితర సిబ్బందిలో దాదాపుగా 120 మంది సర్వేలో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు.

'సమగ్ర సర్వేపై అవగాహన కల్పించాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆయా తండాల్లో సమగ్ర కుటుంబ సర్వేపై డీఎల్‌హెచ్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రఘునాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సర్వేలో భాగంగా కులం కాలమ్‌లో ఎస్టీ (డాడీ లంబాడ) అని తప్పక నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు, రాజునాయక్, ప్రధాన కార్యదర్శి శ్రీనునాయక్, కార్యదర్శి సరియానాయక్, ఖాజానాయక్, నాగేష్‌నాయక్ పాల్గొన్నారు.

నిధుల వివరాలు ఇవ్వండి

జడ్చర్ల: బాదేపల్లి సింగిల్‌విండో ఆధ్వర్యంలో నాబార్డు నిధులను ఉపయోగించి నిర్మించిన గోదాం వ్యయానికి సంబంధించి పూర్తి వివరాలు అందజేయాలని సింగిల్‌విండో డైరెక్టర్లు డి.కృష్ణయ్య, హతిరాం, రామకృష్ణారెడ్డిలు మంగళవారం సమాచార హక్కు చట్టం సీఈఓ యాదగిరికి దరఖాస్తు చేశారు. గోదాం నిర్మాణానికి వినియోగించిన నిధులు, కేటాయించిన నిధులు, తదితర పూర్తి వివరాలతో పాటు 2019–24 సంవత్సరాల బడ్జెట్, ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు, సింగిల్‌విండోకు వచ్చిన కమిషన్, యూరియా విక్రయాలకు సంబంధించిన వివరాలు తెలియపర్చాలని దరఖాస్తులో పేర్కొన్నారు.

ఇంగ్లిష్ చానెల్ ఈదడం అభినందనీయం



మహబూబ్‌నగర్ క్రీడలు: స్విమ్ ఎవరెస్ట్‌గా పిలిచే ఇంగ్లిష్ చానెల్‌ను ఈది రికార్డు నెలకొల్పడం సంతోషంగా ఉందని ప్రముఖ స్విమ్మర్ గంధం క్వీని విక్టోరియా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడల వ్యవహారాల సలహాదారు, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి సూచన మేరకు మంగళవారం డీవైఎస్‌ఓ శ్రీనివాస్‌తో కలిసి ఆమె జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో గల స్విమ్మింగ్‌పూల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని యువతకు స్విమ్మింగ్‌పై అవగాహన కల్పించాలని, స్విమ్మింగ్‌లో వారికి మెరుగైన శిక్షణ ఇవ్వాలని కోరారు. తనది ఉమ్మడి జిల్లాలోని ఆమనగల్ కాగా.. ప్రస్తుతం హైదరాబాద్‌లో స్థిరపడినట్లు చెప్పారు. 43 ఏళ్ల వయస్సులో ఇంగ్లిష్ చానెల్‌ను ఈదడం గర్వంగా ఉందన్నారు. అనంతరం ఆమెను డీవైఎస్‌ఓ సత్కరించారు.

విద్యార్థి అదృశ్యం

నవాబుపేట: మండలంలోని మరికల్ గ్రామంలో ఉన్న ఎస్సీ హాస్టల్ విద్యార్థి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. వార్డెన్ నరేందర్‌రెడ్డి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. మరికల్‌కి చెందిన 6వ తరగతి విద్యార్థి మంగళి నందకుమార్(11) హాస్టల్‌లో ఉంటు చదువుకుంటున్నాడు. కాగా సోమవారం హాస్టల్ నుంచి ఎప్పటి మాదిరిగా పాఠశాలకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అందరూ వెతికి విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి సైతం వెళ్లకపోవడంతో మంగళవారం వార్డెన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. విద్యార్థి అదృశ్యంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బీవీపీ సేవలు అభినందనీయం



బహుమతులు పొందిన విద్యార్థులతో బీవీపీ ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: భారత్ వికాస్ పరిషత్ సంస్థ చేపడుతున్న సేవలు అభినందనీయమని ప్రముఖ న్యాయవాది వి.మనోహర్‌రెడ్డి అన్నారు. స్థానిక లక్ష్మీనగర్‌కాలనీలోని సాయిమందిరంలో మంగళవారం బీవీపీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు భారత్‌కోజానో క్విజ్ పోటీలు నిర్వహించారు. బీవీపీ చీఫ్ ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి క్విజ్ పోటీలతో విద్యార్థుల్లో దేశభక్తి, భారత దేశచరిత్ర, నాగరికత, భౌగోళిక పరిస్థితులు, సంస్కృతి, సంప్రదాయాలు, రాజకీయాలపై అవగాహన పెరుగుతుందన్నారు. బీవీపీ ప్రతినిధులు మాట్లాడుతూ క్విజ్ పోటీల్లో సీనియర్ విభాగంలో ఎంజేపీటీ బీసీడబ్ల్యూ (బాలికలు–భూత్పూర్), యూనివర్సల్, నాగార్జున, కాకతీయ పాఠశాలలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులు అందుకున్నట్లు తెలిపారు. జూనియర్ విభాగంలో ఎంజేపీటీ బీసీడబ్ల్యూ (బాలికలు–భూత్పూర్) పాఠశాల, రెయిన్‌బో, కాకతీయ, ఎంజేపీటీ బీసీడబ్ల్యూ(బాలికలు–వేపూర్)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులు సాధించాయని తెలిపారు. వారికి నగదుతో పాటు మెమెంటోలు, మెడల్స్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీవీపీ ప్రతినిధులు జి.పాండురంగం, భూషణ్‌పాండే, పుట్టి రమేష్ చందర్, వీఎస్‌ఆర్‌కే.ప్రసాద్, చంద్రుడు, వెంకటేశ్వర్‌గుప్త, యతిరాజాచారి, వి.శంకరయ్య, సహదేవ్, పార్థ సారథి, రాఘవారెడ్డి, నారాయణగౌడ్, రాంచందర్, సురేష్ దూత్, చంద్రశేఖర్, బస్వరాజ్ పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లెగోపాల్

మహబూబ్‌నగర్ న్యూటౌన్/ మహబూబ్‌నగర్ రూరల్: సీపీఎం జిల్లా మహాసభలు 8, 9 తేదీల్లో జడ్చర్ల పట్టణంలో జరుగనున్నాయని, ఈ మహాసభలకు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి వ్యతిరేకంగా చట్టాలు తెచ్చిందని, 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పడాకుల వెంకటయ్య, కృష్ణయ్య, గోనెల ఆంజనేయులు, నాయకులు చంద్రకాంత్, రాజ్‌కుమార్, కురుమూర్తి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

- జడ్చర్ల పట్టణంలో ఈనెల 8, 9వ తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా 20వ మహాసభల పోస్టర్‌ను మండలంలోని మాచన్‌పల్లిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కడియాల మోహన్ మాట్లాడారు. కార్యక్రమంలో హన్మంతు, ఖాదర్, శివలీల, శివ పాల్గొన్నారు.

కొత్త మెనూ అమలు చేయాలి

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో పెరిగిన మెస్ చార్జీలకు అనుగుణంగా, విద్యార్థులకు కొత్త మెనూ అమలు చేసి నాణ్యమైన భోజనం అందించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు కేవీపీఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు పెరిగి పదిరోజులైనా జిల్లాలో ఏ హాస్టల్‌లో కొత్త మెనూ తయారు చేయలేదన్నారు. జిల్లా అధ్యక్షుడు మాణిక్యంరాజు, ఉపాధ్యక్షుడు రాములు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, వారికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కన్వీనర్ అక్షయ మాట్లాడుతూ పది రోజుల క్రితం ఎన్టీఆర్ కళాశాల ముందు మహిళ పై ఇద్దరు దుండగులు దాడి చేశారని, రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో సంఘటన జరిగినా ఏం చేయలేకపోయారన్నారు. బయటి రాష్ట్రాల వక్తలకు సూచనలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. శివప్రసాద్, సిద్ధు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల చవితి వేడుకలు



జడ్చర్లలోని బంగారుమైసమ్మ దేవాలయంలో పుట్టవద్ద భక్తుల పూజలు

జడ్చర్ల టౌన్: కార్తీకమాసం నాగుల చవితి వేడుకలు మంగళవారం జడ్చర్లలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రాంతవాసులు శ్రావణమాసంలో వచ్చే చవితి, పంచమిలను నాగులచవితి, గరుడపంచమిగా జరుపుకోవటం తెలిసిందే. ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు చెందిన వారు మాత్రం నాగులచవితి వేడుకలను కార్తీకమాసంలో వచ్చే తొలిచవితిని జరుపుకుంటారు. జడ్చర్లలో సెజ్ కారణంగా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు చెందిన వారు అధికంగా నివాసం ఉంటున్నారు. వారంతా కార్తీక చవితి పురస్కరించుకుని మంగళవారం సమీపంలోని ఆలయాల్లో పుట్టలకు పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు. వారితోపాటు ఈ ప్రాంత వాసులు సైతం పాతబజార్ బంగారు మైసమ్మ దేవాలయంలోని పుట్టవద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల సందడి నెలకొంది. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఆంజనేయస్వామి దేవాలయంలోనూ భక్తుల రద్దీ అధికంగా నెలకొంది. విద్యానగర్‌లోని రేణుకాఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారికి అభిషేకాలు చేసి సమీపంలోని పుట్టకు పాలుపోసి వేడుకలు జరుపుకున్నారు.

8న మండలంలో జాతీయ బృందం పర్యటన



తీగలపల్లి సెగ్రిగేషన్ షెడ్‌ను పరిశీలిస్తున్న మండల అధికారులు

నవాబుపేట: గ్రామాల్లో కొనసాగుతున్న జాతీయ ఉపాధిహామీ పథకం పనులు పరిశీలించేందుకు జాతీయ బృందం 8న మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. జాతీయ బృందం పర్యటించే గ్రామాలు మంగళవారం మండల అధికారులతో వెళ్లి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8, 9 తేదీల్లో ప్రత్యేక జాతీయ బృందం పర్యటిస్తుందని, మండలంలో 54 గ్రామాల్లో 5 గ్రామాలను కమిటీ ఎంపిక చేసిందన్నారు. మండలంలోని కేశవరావుపల్లి, తిమ్మయ్యపల్లి, తీగలపల్లి, దయపంతులపల్లి, పల్లెగడ్డ గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీటిలో తీగలపల్లి, కేశవరావుపల్లి, తిమ్మయ్యపల్లి గ్రామాల్లో ఉపాధి హామీలో చేపట్టిన పనులను బృందం సభ్యులు పరిశీలించనున్నారు.

నీళ్లచోరీపై నివేదిక అందిస్తాం

- లోకాయుక్త సభ్యుడు మాథ్యు ఖుషి



మాట్లాడుతున్న లోకాయుక్త సభ్యులు

జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లి ఫార్మసెజ్‌లో జరుగుతున్న నీళ్లచోరీపై విచారణ చేసి నివేదిక అందజేస్తామని లోకాయుక్త సభ్యుడు మాథ్యు ఖుషి వెల్లడించారు. మంగళవారం రాత్రి తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలేపల్లిలో వ్యవసాయ బోర్ల ద్వారా కంపెనీలకు నీళ్లు అమ్ముకుంటున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామంలో విచారణ చేశామన్నారు. గ్రామంలో ఇదివరకు జిల్లాకు చెందిన ఐదురుగు అధికారుల బృందం జిల్లా పంచాయతీ అధికారి, సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌డీఓ, తహసీల్దార్‌లు గ్రామంలో 20 బోర్లు సీజ్ చేసినట్లు గుర్తించామన్నారు. ఇంకా 20కిపైగా బోర్లు కంపెనీలకు నీటిని అమ్ముతున్నాయన్నారు. తమ పర్యటనలో వాటర్ ట్యాంక్ నీటిని తీసుకెళ్తుండగా ఆర్‌ఐ ద్వారా సీజ్ చేయించామన్నారు. ఒక కంపెనీలో 25 ట్యాంకర్ల నీటిని కంటిన్యూ గ్రౌండ్ వాటర్ తెచ్చుకుంటున్నాయన్నారు. ఒక మాజీ సర్పంచ్ 4బోర్లువేసి స్లంప్‌కు నీటిని పంపింగ్‌చేసి అక్కడ ఒక మీటరు పెట్టి నీటిని అమ్ముతున్నారని, మరో మాజీ సర్పంచ్ అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ వేసి ఇల్లీగల్‌గా నీటిని తరలిస్తున్నారని, మరో వ్యక్తి మూడుబోర్లు వేసి నీటిని అమ్ముతున్నారని గుర్తించామన్నారు. నీటిచౌర్యంలో చాలా అన్యాయం జరుగుతుందని, కరెంట్ డిపార్ట్‌మెంట్‌కు లక్షల్లో నష్టం, రెవెన్యూకు లాస్ అవుతుందన్నారు. అన్ని శాఖల అధికారుల బాధ్యతతో వ్యవహరిస్తే అన్యాయం జరగదన్నారు. వ్యవసాయ బోర్లను వినియోగించి నీటిని అమ్ముకోవటంపై నివేదిక తయారు చేసి లోకాయుక్తకు అందిస్తామన్నారు. కొందరు అధికారులతో పాటు బోర్‌వెల్‌లు దుర్వినియోగం చేస్తున్న వారికి నోటీసులు జారీ చేస్తామన్నారు. పూర్తి విచారణ చేయాలని తహసీల్దార్ బ్రహ్మంగౌడ్‌కు సూచించారు. విచారణలో ఎస్‌ఐ శివప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ రాంరెడ్డి ఉన్నారు.

హాస్టల్‌లో వసతులు కల్పించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ బాలికల హాస్టల్‌లో విద్యార్థినులకు పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని మంగళవారం రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డికి ఏబీవీపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, ఒక్క రూంలో 8 నుంచి 10 మంది విద్యార్థులు ఉంటున్నారని, తాగునీరు సరిగా లేకపోవడం, అన్నం, కూరగాయలు నాణ్యత లేకుండా ఇస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల నుంచి స్పెషల్ ఫీజుల పేరిట రూ.1,800 ఎందుకు వసూలు చేస్తున్నారని, అడిగితే సమాధానం చెప్పడం లేదన్నారు. ఆయా సమస్యలు వెంటనే పరిష్కరించాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణకుమార్, సింధు, ప్రియ, అనిత, పూజ, ప్రియాంక, శివకుమార్, నాగేష్, వేణుగోపాల్, ఆదిత్య, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ శిక్షణ ప్రారంభం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీఎం విశ్వకర్మ రజక వృత్తిలో శిక్షణ పొందే వారికి 7వ బ్యాచ్ శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లీడ్ బ్యాంక్ మేనేజర్ భాస్కర్ హాజరై మాట్లాడారు. ఇక్కడ శిక్షణ పొందిన అభ్యర్థులు ఉపాధి అవకాశాలు పొందేందుకు అనేక మార్గాలు ఉన్నాయని, వారం రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. శిక్షణ పొందిన అనంతరం లోన్ సదుపాయం కూడా కల్పిస్తామన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ శిక్షణ తీసుకునే అభ్యర్థులు నైపుణ్యాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని, ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేట బీసీ కార్పొరేషన్ అధి కారి అబ్దుల్ ఖలీల్, రీసోర్సుపర్సన్లు వసుంధర, వనజాదేవి, సత్యనారాయణరెడ్డి, సాయికిరణ్ పాల్గొన్నారు.